క్లుప్తంగా

9న 'మనూ' ఐటీఐలో అడ్మిషన్ కౌన్సిలింగ్

రాయదుర్గం: మనూ ఐటీఐలో ఈనెల 9వ తేదీన అడ్మిషన్ కౌన్సిలింగ్ నిర్వహించనున్నట్లు ఐటీఐ ప్రిన్సిపల్ డాక్టర్ అర్షియా ఆజిమ్ తెలిపారు. 'మనూ' ఐటీఐలోని వివిధ ట్రేడ్స్‌లో ఖాళీగా ఉన్న సీట్లలో ప్రవేశానికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు. దరఖాస్తులను సమర్పణకు అక్టోబర్ 8 చివరి తేదీ అని పేర్కొన్నారు. 9వ తేదీ ఉదయం 9.30కు అడ్మిషన్ కౌన్సిలింగ్‌ను గచ్చిబౌలిలోని 'మనూ' క్యాంపస్‌లోని ఐటీఐ భవనంలో నిర్వహిస్తామన్నారు. దరఖాస్తులు కావాల్సిన వారు యూనివర్శిటీ వెబ్‌సైట్ www.manuu.edu.in నుంచి పొందవచ్చని ఆమె పేర్కొన్నారు. వివరాలకు ఐటీఐ కార్యాలయంలో వ్యక్తిగతంగా లేదా ఫోన్ ద్వారా 040-23008428, సెల్‌ఫోన్ 9440692452లో సంప్రదించవచ్చన్నారు.

హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీశైలంలో వసతి గది

హఫీజ్‌పేట్ : శ్రీశైలం పుణ్యక్షేత్రంలో హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గణేష్ సదన్‌లో నూతనంగా వసతి గది నిర్మించినట్లు చైర్మన్ కొండ విజయ్‌కుమార్ తెలిపారు. శేరిలింగంపల్లి పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులకు మహాక్షేత్రంలో వసతిగది ఉంటుందని తెలిపారు. భక్తులకు తమ ఫౌండేషన్ చేయూతనిస్తుందన్నారు.

9న ఉపాధ్యాయ విద్యపై సమావేశం

- 'మనూ' ఎస్ఈ అండ్ టీ ప్రొఫెసర్ వనజ

రాయదుర్గం: మనూ విశ్వవిద్యాలయంలో స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ (ఎస్ఈ అండ్ టీ) ఆధ్వర్యంలో 'ఉపాధ్యాయ విద్యలో కొత్త విధానాలు, అవకాశాలు, సవాళ్ళు' అనే అంశంపై ఒకరోజు సమావేశాన్ని నిర్వహిస్తామని ఎస్ఈ అండ్ టీ డీన్ ప్రొఫెసర్ ఎం వనజ తెలిపారు. 'మనూ' క్యాంపస్‌లోని సీపీడీయూఎంటీ ఆడిటోరియంలో ఈనెల 9వ తేదీన ఉదయం 10.30 గంటలకు ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్(ఐటీఈపీ)ని కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు.మధ్యాహ్నం 3 గంటలకు జరిగే చర్చా కార్యక్రమంలో ప్యానలిస్టులుగా ప్రొఫెసర్ ఘంటా రమేష్, ప్రొ. శ్రీనివాసరావు, ప్రొ.జీవి మధుసూదన్, డా.శంకర్ పాల్గొంటారని వివరించారు.

శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో బదిలీలు

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం అధికారుల బదిలీలు జరిగాయి. డిప్యూటి తహసీల్దార్ శంకర్ మేడ్చల్-మల్కాజ్‌గిరి కలెక్టర్ కార్యాలయంకు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌లు శీనయ్య గండిపేట్ మండలం, శ్రీకాంత్ షాబాద్ మండలం, జూనియర్ అసిస్టెంట్‌లు నరేందర్ రెడ్డి మహేశ్వరం, రామకృష్ణ అబ్దుల్లాపూర్‌మెట్, శ్రీలత హయత్‌నగర్ మండల తహసీల్దార్ కార్యాలయంకు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లుగా ఏ.శ్రీను కందుకూరు మండలం, పవన్ కళ్యాణ్ శంకర్‌పల్లి, జూనియర్ అసిస్టెంట్‌లుగా నరేష్ మహేశ్వరం, ప్రశాంత్ అబ్దుల్లాపూర్‌మెట్, ఆంజనేయులు హయత్‌నగర్ మండలం నుంచి వచ్చారు. శేరిలింగంపల్లి మండల తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

బ్రేక్ ఫాస్ట్.. భేషుగ్గా..

పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యేలు


బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమంలో విద్యార్థికి తినిపిస్తున్న ఎమ్మెల్యే గాంధీ


తెల్లాపూర్‌లోని జిల్లాపరిషత్ పాఠశాలలో కేసీఆర్ అల్పాహార పథకాన్ని ప్రారంభించి విద్యార్థులతో కలిసి తింటున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

నల్లగండ్ల ,పటాన్‌చెరు డివిజన్
తెల్లాపూర్ ప్రభుత్వ పాఠశాలల్లో సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం ప్రారంభం

హఫీజ్‌పేట్ : సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం గొప్ప మానవీయ సంక్షేమ పథకమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. శుక్రవారం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని నల్లగండ్ల ప్రాథమిక పాఠశాలలో సీఎం బ్రేక్ ఫాస్ట్ కార్యక్రమంను శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాధికారి వెంకటయ్య, స్థానిక కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించి విద్యార్థులతో కలిసి బ్రేక్ ఫాస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉదయం పూట ఆకలి తీర్చే గొప్ప పథకం సీఎం బ్రేక్ ఫాస్ట్ అని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 20 లక్షల విద్యార్థులకు ఉపయోగపడుతుందన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో 73 ప్రభుత్వ పాఠశాలలో 22,000 మంది విద్యార్థులకు ఈ పథకం ద్వారా పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. దేశంలో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్ అందించే ఒకే ఒక్క రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమన్నారు. ఇంగ్లీష్ మీడియం, వెయ్యి రెసిడెన్షియల్ స్కూళ్ళు, ఆడపిల్లల కోస ప్రత్యేక విద్యాలయాలు ప్రారంభించడం జరిగిందన్నారు. దసరా తరువాత రాష్ట్ర వ్యాప్తంగా సీఎం బ్రేక్ ఫాస్ట్ పథకం అమలు అవుతుందన్నారు .కార్యక్రమంలో కార్పొరేటర్లు జగదీశ్వర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

తెల్లాపూర్ మున్సిపాలిటీ జిల్లాపరిషత్ పాఠశాలలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో కేసీఆర్ అల్పాహార పథకాన్ని శుక్రవారం ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయాన్నే స్కూలుకు వచ్చే పిల్లలు ఆకలితో అలమటించకూడదన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. నిత్యం విద్యార్థులకు అల్పాహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలోని 158 ప్రభుత్వ పాఠశాలలో 25,861 మంది విద్యార్థులకు ఈ పథకం అమలవుతుందని తెలిపారు. విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. అభివృద్ధిలో రాష్ట్రం అందరికీ ఆదర్శంగా నిలిచిందని తెలిపారు. అనంతరం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ కాలనీలలో రూ.3 కోట్ల 90 లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తెల్లాపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్లెపల్లి లలితా సోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములుగౌడ్, కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇడ్లీలు బాగున్నాయి...



అల్పాహారం బాగుంది. ఉదయం ఇడ్లీలు వేడిగా రుచికరంగా ఉన్నాయి. మా నాన్న వాచ్‌మెన్. అమ్మ టిఫిన్‌గా అన్నం పెడుతుంది. కానీ ఇప్పుడు ఈ కార్యక్రమంతో రోజు ఒక రకమైన టిఫిన్ తింటాం.
– రమ్యశ్రీ, 5వ తరగతి, నల్లగండ్ల ప్రభుత్వ ప్రైమరీ స్కూల్

సీఎం సార్‌కు ధన్యవాదాలు



రోజూ టిఫిన్ పెడతారంటే చాలా సంతోషంగా ఉంది. మా నాన్న డ్రైవర్, అమ్మ వాచ్‌మెన్. టిఫిన్ కింద రోజు అమ్మ అన్నం పెట్టేది. కానీ సీఎం అల్పాహారం కింద రకరకాల టిఫిన్స్, మధ్యాహ్నం భోజనం అందిస్తున్నందుకు సీఎం సార్‌కు కృతజ్ఞతలు.
–నాని, 5వ తరగతి, నల్లగండ్ల ప్రభుత్వ ప్రైమరీ స్కూల్

ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది


గోపన్‌పల్లితండాలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ ప్రారంభోత్సవంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్, నాయకులు

- చేవెళ్ళ పార్లమెంటు సభ్యుడు డా.రంజిత్‌రెడ్డి
- గోపన్‌పల్లితండాలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్ ప్రారంభం

రాయదుర్గం/హఫీజ్‌పేట్: ప్రజల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని చేవెళ్ళ పార్లమెంటు సభ్యుడు డాక్టర్ రంజిత్ రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని గోపన్‌పల్లితండాలో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను ఆయన ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సాయిబాబాతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లిని అన్ని రంగాలలో అగ్రగ్రామిగా నిలిపేందుకు గాంధీ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.గతంలో ఎన్నడూ లేనివిధంగా శేరిలింగంపల్లిలో అభివృద్ధి గత తొమ్మిదేళ్ళకాలంలో జరిగిందన్నారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ ప్రైవేటు ఫంక్షన్ హాళ్లకు దీటుగా మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను తీర్చిదిద్దడం జరిగిందన్నారు. అభివృద్ధిలో శేరిలింగంపల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామన్నారు.కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఎస్ఈ శంకర్‌నాయక్, ఈఈ శ్రీనివాస్, ఏఈ సునీల్, వర్క్ఇన్‌స్పెక్టర్ మహేష్, మాజీ కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పాపిరెడ్డికాలనీలో రూ.3.95 కోట్లతో మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్..

శేరిలింగంపల్లి డివిజన్ పాపిరెడ్డికాలనీలో రూ.3.95 కోట్ల వ్యయంతో నిర్మించిన మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌ను చేవెళ్ళ ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేగాంధీ, కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ రెండు ఎకరాల స్థలంలో రూ.3.95 కోట్ల వ్యయంతో అత్యాధునిక హంగులతో, సకల సౌకర్యాలతో మల్టీపర్పస్‌హాల్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ అధికారులు, నాయకులు, బస్తీవాసులు పాల్గొన్నారు.

శంకుస్థాపన

రామచంద్రాపురం(పటాన్‌చెరు): డివిజన్ పరిధిలోని శ్రీనివాసనగర్‌కాలనీలో శుక్రవారం భూగర్భ డ్రైనేజీ పనులకు కార్పొరేటర్ పుష్ప నగేష్ శంకుస్థాపన చేశారు.

ప్రజాసేవే లక్ష్యం

- తారానగర్‌లో రవన్న ప్రజాయాత్ర



హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు సేవ చేసుకుంటానని తనను ఆశీర్వదించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం చందానగర్ డివిజన్ పరిధిలోని తారానగర్ మార్కెట్, చందానగర్ మెయిన్ రోడ్డు ఎస్టేట్‌లో గడపగడపకు బీజేపీ రవన్న ప్రజాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎవరిని అడిగినా భిక్షపతి యాదవ్ చేసిన అభివృద్ధి గురించి చెబుతారన్నారు. ఇక రెండు నెలల్లో కేసీఆర్ ఇంటికి వెళ్ళడం ఖాయమన్నారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌ల ఆశీస్సులతో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగరవేస్తామన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ రాఘవేంద్రరావు, మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి, నాయకులు రామ్‌రెడ్డి, మల్లేష్ గౌడ్, శ్రీనివాస్, అర్జున్, రవి, అశోక్, బాబు తదితరులు పాల్గొన్నారు.

బస్సుల రాకపోకలకు అనుమతివ్వాలని వినతి


చందానగర్ ట్రాఫిక్ సీఐ పవన్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న రామస్వామి

హఫీజ్‌పేట్ : లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించేందుకు అనుమతులు ఇవ్వాలని చందానగర్ ట్రాఫిక్ సీఐ పవన్‌కుమార్‌కు మాజీ కౌన్సిలర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద నుంచి ఆర్టీసీ బస్సులను వెళ్ళకుండా నిలిపివేశారు. దీంతో ఆదర్శనగర్, గోపినగర్, నెహ్రూనగర్, దూబె కాలనీ, సురభి కాలనీ, పాపిరెడ్డి కాలనీ, రాజీవ్ గృహకల్ప, రాజీవ్ స్వగృహ, సిటిజన్ కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. మెహిదీపట్నం నుంచి బీహెచ్ఈఎల్ వెళ్ళేందుకు ప్రజా రవాణా సౌకర్యం లేక స్థానికులు అవస్థపడుతున్నారన్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్ట్యా ఆర్టీసీ బస్సులు తిరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గచ్చిబౌలి: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏపీహెచ్‌పీ కాలనీ, ఓల్డ్ గచ్చిబౌలి స్ట్రీట్ నెంబర్ 1,2,3, రాడిసన్ హోటల్, క్వయట్‌లాండ్ విల్లాస్, గచ్చిబౌలి ఫ్లైఓవర్ బ్రిడ్జి పరిసరాలు, హిమగిరి హాస్పిటల్ తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

రూ.40 కోట్లతో 7 కిలోమీటర్లు మంజీరా పైప్‌లైన్

హఫీజ్‌పేట్ : హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని బీహెచ్ఈఎల్ ప్రధాన గేట్ నుంచి కల్వరి టెంపుల్ వరకు 7 కిలోమీటర్ల మేర సుమారు రూ.40 కోట్లతో నూతనంగా మంజీరా మంచినీటి పైప్‌లైన్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని చేవెళ్ళ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ గడ్డం రంజిత్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డివిజన్ పరిధిలోని హుడా కేఫ్ దగ్గర మంచినీటి పైప్‌లైన్ నిర్మాణానికి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ, కార్పొరేటర్లతో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1960లో నిర్మించి మంజీరా పైప్‌లైన్ నిత్యం లీకేజీలతో నీటి వృధా జరుగుతోందని, రోడ్లు దెబ్బతినడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. లీకేజీలతో సతమతం అవుతున్న స్థానికులకు శాశ్వత పరిష్కారం లభించనుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, జలమండలి అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

హామీల అమలులో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలం


మియాపూర్‌లో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు రఘునాథ్‌యాదవ్

మియాపూర్: ఎన్నికల హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు రఘునాథ్‌యాదవ్ అన్నారు. మియాపూర్ పరిధిలోని మక్తమహబూబ్‌పేట్, స్వర్ణపురి కాలనీ, పీఏనగర్ కాలనీలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా రఘునాథ్ యాదవ్ కాలనీలలో ఇంటింటికీ తిరిగి కాంగ్రెస్ పార్టీ ఇటీవల ప్రకటించిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గంలో ప్రజలు కాంగ్రెస్ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని అన్నారు.

నీటి లభ్యత తగ్గుతోంది

- హెచ్‌సీయూ, ఐఐటీ-బాంబే శాస్త్రవేత్తల వెల్లడి

రాయదుర్గం: గ్లోబల్ వార్మింగ్, వేగవంతమైన అభివృద్ధి, పెరుగుతున్న జనాభా, పట్టణ ప్రాంతాలకు పెరుగుతున్న వలసలతో భారతదేశంలో నీటి లభ్యత తగ్గుతోందని హెచ్‌సీయూ, ఐఐటీ బాంబే శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. ప్రతి ఏటా 174 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీటిని రవాణా చేసే సుమారు 15వేల కిలోమీటర్ల కాలువలు, దాదాపు 3వేల రిజర్వాయర్ల నెట్‌వర్క్‌ని ఉపయోగించి దేశంలోని ప్రధాన నదీ పరీవాహక ప్రాంతాలను అనుసంధానం చేసే ప్రాజెక్టులను ప్రభుత్వం ప్లాన్ చేసింది. దేశవ్యాప్తంగా నీటిపారుదల విస్తీర్ణంలో 30 మిలియన్ హెక్టార్ల పెరుగుదలను లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ పరిశోధనకు ఐఐటీ బొంబాయికి చెందిన ప్రొఫెసర్ సుబిమల్ ఘోష్ ,హెచ్‌సీయూకి చెందిన కారుమూరి అశోక్ మార్గదర్శకత్వం వహిస్తున్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం

మియాపూర్ : ఉచిత కంటి శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ పేర్కొన్నారు. మియాపూర్‌లోని మక్తమహబూబ్‌పేట పీఏనగర్, స్వర్ణపురి కాలనీలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరానికి ఆయన హాజరై 500 మందికి కళ్లద్దాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగులుగౌడ్, మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి, మాణిక్‌రావు, గణేష్‌ముదిరాజ్, రాజేష్‌గౌడ్, శివరాజ్‌ముదిరాజ్, లక్ష్మణ్ ముదిరాజ్, రామకృష్ణారెడ్డి, శివారెడ్డి పాల్గొన్నారు.

దాడి కేసులో.. రెండేళ్లు జైలు, జరిమానా

మాదాపూర్: ఓ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఇద్దరు నిందితులకు న్యాయస్థానం రెండేళ్లు జైలు, జరిమానా విధించింది. మాదాపూర్ ఇన్‌స్పెక్టర్ ఎన్.తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం..2017లో మాదాపూర్‌కి చెందిన రాజపుత్ర రాఘవేంద్రసింగ్, సతీష్‌సింగ్‌లు సైట్ ఇంజనీర్ ప్రభాకర్‌పై దాడి చేశారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం కూకట్‌పల్లి న్యాయస్థానం రాజపుత్ర రాఘవేంద్రసింగ్‌కు రెండు సంవత్సరాల జైలుశిక్ష, సతీష్‌సింగ్‌కు వెయ్యి రూపాయలు జరిమానా విధించారు.

గుజరాత్ హస్తకళా ఉత్సవ్- 2023


మేళాలో సందర్శకులు


కథక్ నృత్యం

మాదాపూర్: గుజరాత్ హస్తకళల ఉత్సవ్ సందర్శకులను ఆకట్టుకుంటుంది. చేనేత కళాకారులు తయారు చేసిన ఉత్పత్తులు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. ఈనెల 8వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ ప్రదర్శన ఉదయం 10.30 గంటల నుంచి రాత్రి 8గంటల వరకు అందుబాటులో ఉంటుంది. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న ఇండస్ట్రీయల్ ఎక్స్‌టెన్షన్ కాటేజ్ (ఇండెక్స్-సీ)లో గుజరాత్ కళాకారులచే తయారు చేయబడిన చేనేత హస్తకళ ఉత్పత్తులను మేళాలో విక్రయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చేతివృత్తుల కళాకారులను ప్రోత్సహించడం ముఖ్య ఉద్దేశంగా ఏర్పాటు చేశారు. ఈప్రదర్శనలో అంతరించిపోయిన లాంగ్విషింగ్ క్రాఫ్ట్ ఆర్టిజన్ ప్రత్యక్ష ప్రదర్శనలు ఆకట్టుకుంటున్నాయి.

- మేళాలో గుజరాత్ రాష్ట్రం నుంచి 80 మందికి పైగా మాస్టర్ క్రాఫ్ట్స్‌మెన్‌లు పాల్గొన్నారు.
- పటోలా, తంగలియా నేయడం, శాలువాలు, కుచ్చి ఎంబ్రాయిడరీలు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి.
- అజ్రఖ్ బ్లాక్‌ప్రింట్, టై అండ్ డై, లెదర్ వర్క్, కాపర్‌బెల్, మడ్ మిర్రర్, జరీ జర్దోషీ, పూసల పని, అగేట్ ఆర్టికల్స్, చనియాచోలి, అప్లిక్ వర్క్, వుడెన్, మెటల్ వర్క్ స్టాల్స్ అందుబాటులో ఉన్నాయి.
- వివిధ రకాల ఆభరణాలు, ఉపకరణాలు, గృహాలంకరణ, ఫర్నిషింగ్‌లు ప్రదర్శనలో ఉంచారు.
- రోజు సాయంత్రం 5గంటలకు ఆంపి థియేటర్‌లో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.
- గుజరాత్ జానపద నృత్యాలైన రాస్ గర్బ ప్రదర్శిస్తున్నారు.
- కూచిపూడి, భరతనాట్యం, సంగీత కచేరీలు తదితర కార్యక్రమాలు జరుగుతున్నాయి.

అలరించిన కథక్, కాంటెంపరరీ నృత్యాలు

మేళాలో భాగంగా శుక్రవారం కథక్, కాంటెంపరరీ నృత్యాలతో కళాకారులు సందర్శకులను అలరించారు. సంజుక్త ఘోష్, బైసాకిరాయ్ బృందం గురువందన, గణేశ్‌వందన, సమోదుర్గ, శివతాండవ, తుంగ తుంగ, అయిగిరినందిని, కృష్ణకవిత, గర్భకృష్ణ తదితర అంశాలను ప్రదర్శించారు. కళాకారులు బైషాకి రోమిత, కామేపాల్, సంజుక్త, ఇనాయ, శాన్వి, నిషిత, అదితిరి, యశ్వీ, అనయ, శ్రీయ ఆరాత్రిక, సహస్రలు పాల్గొని ప్రదర్శించారు.




రాస్‌గర్బ జానపద నృత్యం